క్లుప్తంగా

సందడిగా నందెన్న నిమజ్జనం



భవానీపురంలో నందెన్నను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో నందెన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు. జగన్నాథపురం, భవానీపురం, గుండవల్లిపేట, దేవాది కాలనీ, బాడాం తదితర గ్రామాల్లో రైతులు నందెన్న ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నరసన్నపేట పంచాయతీ పరిధిలోని భవానీపురంలో నందెన్నను నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నీలమణి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఒడిశా ప్రజలకు కార్తీకమాసం కావడంతో అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

భగవద్గీత పారాయణం చేయాలి



ఉపన్యసిస్తున్న గీతా ఉపాన్యాసకులు అప్పలరాజు

సారవకోట: ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని గీతా ఉపాన్యాసకులు అప్పలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హాజరైన అప్పలరాజు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన భగవద్గీతలో మన నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుందన్నారు. అల్లు రామయ్య, నరసింహస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. వచ్చే నెల 100వ ఆధ్యాత్మిక సత్సంగాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు, పిట్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.


సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న దంపతులు

మెళియాపుట్టి: ప్రపంచ శాంతికోసం ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ పాటించాలని బెంగుళూరుకు చెందిన ఓంశాంతి గురువు బి.కె.మంజునాథ్ అన్నారు. మండలంలోని చాపర త్రిలోక్ భవన్‌లో ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆదివారం 30 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ వ్రతం చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనాలను బోధించారు. పూజలలో వాడుతున్న పసుపు, కుంకుమ, దీపాలు.. ఇలా ప్రతీ వస్తువు ఎందుకు వాడాలో తెలియజేశారు. ఆధ్యాత్మికత, ధ్యానం ప్రస్తుత సమాజంలో అవసరమని తెలియజేశారు. పిల్లలకు ఆధ్యాత్మిక విషయాలను బోధించాలని సూచించారు. పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులతోపాటు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి



ఇటీవల కురిసిన వర్షానికి కడపలవాని గెడ్డపై నిండుగా ప్రవహిస్తున్న వరదనీరు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కడపలవాని గెడ్డపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన లోతట్టుగా ఉండటంతో కొద్దిపాటి వర్షాలకు నీరు నిండుగా ప్రవహిస్తోంది. తురకపేట, దబ్బపాడు, వాడవలస తదితర గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వంతెన నిర్మించేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురికి కూపాలుగా.. పార్కులు

- గాలికి వదిలేసిన పార్కులు
- నిర్వహణపై దృష్టి సారించని మున్సిపల్ అధికారులు, పాలకులు
- దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్న పట్టణ వాసులు



పిచ్చి మొక్కలతో నిండి ఉన్న బీఆర్‌నగర్‌లోని అమరావతి పార్క్



మోణింగివారి వీధిలోని నెహ్రూ చిల్డ్రన్ పార్క్ దుస్థితి



అమరావతి పార్క్‌లో బెంచీలపై పెరిగిన పిచ్చిమొక్కలు



మోణింగివారి వీధిలోని నెహ్రూ చిల్డ్రన్ పార్క్‌లో శిథిలమైన ఆట పరికరాలు

ఆమదాలవలస: ప్రస్తుతం ప్రతి ఒక్కరిదీ ఉరుకుల, పరుగుల జీవితం. ఉదయం లేచినప్పటి నుంచి నిద్రపోయే వరకు ఏదో ఒక పనిలో బిజీగా ఉంటున్నారు. సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులతో సాయంత్రం సరదగా గడిపేందుకు పార్కులు, ఆట స్థలాలకు వెళ్తున్నారు. ఆమదాలవలస పట్టణంలో ఉన్న పార్కులను గాలికి వదిలేశారు. పట్టణంలో ఐదు ఉద్యానవనాలు ఉండేవి. బి.ఆర్.నగర్‌లో అమరావతి పార్కు, మోణింగి వారి వీధిలో భగత్ సింగ్, నెహ్రూ పిల్లల ఉద్యానవనాలు, రామలింగేశ్వర పార్కు, పారిశ్రామిక వాడ వద్ద ట్రయాంగిల్ పార్కు, వెంకయ్యపేటలో కోనేరు పార్కులు ఉండేవి. అందంగా, ఆహ్లాదంగా ఉండే పార్కులు నేడు మురికికూపాలుగా, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

విద్యుత్ సరఫరా లేకపోవడం విష సర్పాలకు నిలయాలుగా మారడంతో ప్రజలు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో సాయంత్రం అయ్యేసరికి జనాలతో కళకళలాడేవి. గతంలో ఉద్యానవనాలలో పిల్లల ఆట వస్తువులు, కూర్చోవడానికి బెంచీలు, నడక ట్రాక్‌లు, వివిధ రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకరంగా తయారు చేశారు. ప్రస్తుతం ఇటువైపు అధికారులు, పాలకులు కన్నెత్తి చూడకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, జంతువులకు ఆవాసాలుగా మారాయి. పెద్దలు, పిల్లలు ఆటవిడుపు, ఆహ్లాదానికి దూరంగా ఉండాల్సి వస్తోంది. చిన్నారుల పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఉద్యానవనంలో గడిపే సమయం వారి మానసిక వికాసానికి దోహదపడుతుంది. పార్కుల నిర్వహణ పట్ల మున్సిపల్ అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఉద్యానవనాలను చూస్తే అర్థమవుతోంది. ఆమదాలవలస వాసులు తమ పిల్లలను సీతంపేట, విశాఖపట్నం, శ్రీకాకుళం తీసుకెళ్లాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అధికారులు బాధ్యత తీసుకోవాలి



పట్టణంలో ఉన్న పార్కుల నిర్వాహణకు మున్సిపల్ అధికారులు బాధ్యత తీసుకోవాలి. నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేయాలి. పట్టణ వాసులకు, విశ్రాంత ఉద్యోగులకు ఆటవిడుపు లేకుండా పోయింది. చిన్నారులకు కనీసం పార్కుల అంటేనే తెలియని పరిస్థితి ఉంది.

– జి.జి.మోహన్‌రావు, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, ఆమదాలవలస)

పార్కుల అభివృద్ధికి కృషిచేస్తాం



ఆమదాలవలసలో పార్కుల అభివృద్ధికి నా వంతు కృషిచేస్తాను. పాలకుల దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి నిధుల కేటాయించేందుకు ప్రయత్నం చేస్తాను. పార్కుల నిర్వాహణ విషయమై పలువురు నా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు, పాలకులతో చర్చించి అభివృద్ధి చేస్తాం.

– పి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

గ్రామాల్లో బెల్ట్‌కు తెర తీశారు

- జోరందుకున్న మద్యం విక్రయాలు
- రొట్టవలస, రావివలసలో భారీగా నిల్వలు

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం విధానాన్ని తీసుకువచ్చింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బెల్టు షాపుల ద్వారా లక్షలాది రూపాయలు గడించిన వ్యాపారులు మరలా బెల్టు షాపుల మాటున భారీగా సంపాదించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని రావివలస, రొట్టవలస గ్రామాల్లో కొంతమంది కూటమి నేతలు మద్యాన్ని నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తూ, మద్యంప్రియుల జేబులు గుల్ల చేస్తున్నట్లు సమాచారం. చీకటిపడితే చాలు ఆయా గ్రామాల్లో నడిరోడ్డుపై బహిరంగంగా విక్రయాలు చేస్తున్నారు. ఆ సమయంలో మహిళలు, బాలికలు వీధిలో అడుగుపెట్టేందుకు భయపడుతున్నారు. గ్రామాల్లో పలు తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి బెల్టు దుకాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు



డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో గెలిపొందిన క్రికెట్ జట్లు

నరసన్నపేట: శ్రీ సత్యసాయి నేషనల్ క్రికెట్ లీగ్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. టెక్కలి డివిజన్ నుంచి పలాస జట్టు, శ్రీకాకుళం డివిజన్ నుంచి నరసన్నపేట వైఎంసీఏ జట్టు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఇటీవల జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహించారు. దీంట్లో గెలిపొందిన జట్లుకు డివిజన్ స్థాయిలో ఆడించారు. జిల్లా స్థాయికి ఎంపికైన రెండు జట్ల సభ్యులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు మూర్తి, ఎం.ఎల్.నాయుడు, నరసన్నపేట మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ప్రతిభ



జలుమూరు: విద్యార్థులను అభినందిస్తున్న ఫిజిక్స్ ఫోరం, యూటీఎఫ్ ప్రతినిధులు

జలుమూరు: జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి (సైన్స్) టాలెంట్ పరీక్షలో కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం జిల్లా కేంద్రలో ఈ పరీక్ష నిర్వహించగా మొదటి స్థానంలో నిలిచాలిరు. ఇందులో హేమ శిరిష(పదో తరగతి), ఆర్. ఎర్నంనాయుడు(తొమ్మిదో తరగతి), తర్ర ధరణి (8వ తరగతి) విద్యార్థులున్నారు. వీరికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఫిజిక్స్ ఫోరం అధ్యక్షుడు గొంటి గిరిధర్, సాయిశ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, సీనియర్ అధ్యాపకుడు గుంట లక్ష్మీనారాయణ అభినందించారు.



సారవకోట: నాల్గో స్థానంలో నిలిచిన బుడితి పాఠశాల విద్యార్థులు

నాలుగో స్థానం..

సారవకోట: జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలలో మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీలకు హాజరైన విద్యార్థులు జిల్లా స్థాయిలో నాల్గో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం మాధవరావు, సైన్స్ ఉపాధ్యాయులు కల్యాణి తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



దబ్బపాడులో తాగునీటి కోళాయి వద్ద నీరు అందని దుస్థితి

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు మెగా రక్షిత తాగునీటి పథకం ద్వారా సక్రమంగా తాగునీరు అందక ఆయా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీ తీరంలో నిర్మించిన తాగునీటి పథకం నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకులు కారణంగా తాగునీరు అందటం లేదని తురకపేట, తురకపేట సెంటర్, దబ్బపాడు, వాడవలస తదితర గ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరి కోతలు ప్రారంభం

సారవకోట: మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పలు రకాల విత్తనాలు తక్కువ సమయంలో దిగుబడి రావడంతో రైతులు ఇప్పటికే వరి కోతలు ప్రారంభించి ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి పంట మంచి దిగుబడి వచ్చినట్లు పలువురు రైతులు తెలిపారు. వడ్డినవలస గ్రామానికి చెందిన ఇప్పిలి రామ్మోహనరావు తన వరి పొలంలో ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వచ్చిందన్నారు.



యంత్రంతో చేపడుతున్న వరి కోత

మే మున్నామని..



ఫణిదర్‌కు రూ.25వేలు అందజేస్తున్న స్నేహితులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థి కోరాడ ఫణిదర్ ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో కాళ్లు, చేతులు పోగుట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.25వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. వి.రాజు, ఎస్.సాంబశివరావు, జి.గణేష్, జె.నాగరాజు, పి.రమేష్, జి.బాబీ, జి.లక్ష్మి, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.11,600 ఆర్థికసాయం



శంకరరావుకు ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక పెద్దపేటకు చెందిన మాడుగుల శంకరరావుకు పట్టుశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం రూ.11,600 ఆర్థిక సహాయాన్ని అందించారు. శంకరరావు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని సంఘం తరపున ఆర్థికసాయం చేశారు. శంకరరావు ఇంటికి వెళ్లిన సంఘం ప్రతినిధులు పురుషోత్తంరావు, గుంటుక శ్రీధర్ ఆర్థికసాయం సహాయాన్ని అందించి పరామర్శించారు. సంఘం ప్రతినిధులు అల్లంశెట్టి రామారావు, రవికుమార్, సుధాకరరావు, మాడుగుల మాధవరావు, జల్లేపల్లి ప్రభాకరరావు, భాషా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ప్రజలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మెట్టెక్కివలసలో సరస్వతి పూజా కమిటీ రేజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నమారాధన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. సరస్వతీదేవి పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం గత 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సరుబుజ్జిలి మండలంలోని పాలవలస కాలనీ వద్ద గల విద్యుత్ స్తంభానికి పొదలు అల్లుకున్నాయి. విద్యుత్ స్తంభం కిందనే గ్రామస్తులు పలు రకాల వ్యవసాయ వస్తువులు నిల్వ చేశారు. విద్యుత్ షాక్ తగిలే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పొదలు తొలగించాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

నిరుపయోగం..



జలుమూరులో రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆర్టీసీ బస్ స్టాప్ నిరుపయోగంగా మారింది. చిన్నపాటి మరమ్మతులు చేపడితే పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడుతుంది. బస్‌స్టాప్‌లో ప్రైవేట్ వ్యక్తులు వస్తువులు దాచుకుంటున్నారు. మండల కేంద్రం నుంచి బుడితి, కొమనాపల్లి, అచ్యుతాపురం, నగిరికటకంతోపాటు శ్రీముఖలింగం వరకు, ఇటు చల్లవానిపేట, జర్జంగి, సారవకోట, పాతపట్నం, కోటబొమ్మాళి, టెక్కలి వెళ్లేందుకు ఇదే స్టాప్‌లో బస్సులు ఎక్కుతారు. గంటల తరబడి ఎండ, వానలో బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

– జలుమూరు

పొంచి ఉన్న ప్రమాదం



పాతపట్నం మండలంలోని రొమదల సమీపంలో గల రహదారి పక్కన పంట పొలాల్లో రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. మరికొన్ని స్తంభాలు కూడా వాలిపోయి ఉన్నాయి. విద్యుత్ వైర్లు పంట పొలలకు తాకుతున్నాయి. రహదారి పక్కన ఉండడంతో ఏప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వాహన ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి, పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

– పాతపట్నం

మురుగునీటిలో కుళాయి..



కొత్తూరు మండలం నివగాం గ్రామ మెయిన్ రోడ్డులో(ఎస్సీ కాలనీలో) ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి మురుగునీటిలో ఉంది. మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో కుళాయి చుట్టూ చేరింది. మురుగునీటిని తొలగించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఎస్సీ వీధి వాసులు ఆరోపిస్తున్నారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్నారు.

– కొత్తూరు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన



- కాశీబుగ్గ పోలీసుల సాక్షిగా వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి
- కూటమి పాలనలో దాడులు పెరిగాయి
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులతోపాటు సామాన్య ప్రజలపైన దాడులు పెరిగిపోయాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జిల్లాలోని పలాస-కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పోలీసుల సాక్షిగానే వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడిచేయడం అన్యాయమన్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవటం దురదృష్టకరన్నారు. పోలీసు స్టేషన్‌లోనే దాడి జరిగితే కఠినంగా శిక్షంచాల్సినప్పటికీ రాజకీయ పలుకుబడితో వారి పట్ల పోలీసులు ఉదారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే పలాస పట్టడంలో 13 ఏళ్ల బాలికపైన టీడీపీ నాయకుల కుటుంబాలకు చెందిన యువకులు రెండు రోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించినప్పటికీ వారిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నారా లోకేష్ చెప్పినట్లు రెడ్‌బుక్ పరిపాలన కొనసాగుతోందన్నారు. రెడ్‌బుక్ పరిపాలన పేరుతో హత్యలు, హత్యా రాజకీయాలు, దోపిడీలు, దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. పలాస-కాశీబుగ్గ సంఘటలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షంచాలని, లేకుంటే శాంతియుత పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

హిరమడలం: సీపీఎం జిల్లా 18వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, ఎం.అప్పారావు, పి.కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం హిరమండలం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతర రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. సీపీఎం జిల్లా మహాసభలు నవంబర్ 9, 10వ తేదీలలో పలాస పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నేత బి.తులసీదాస్ హాజరువుతారన్నారు. జిల్లాలోని అనేక సమస్యలపై చర్చిస్తామన్నారు.

ఏఈఓల నిరసన..



నిరసన తెలుపుతున్న వ్యవసాయశాఖ ఏఈఓలు

ఆమదాలవలస: వ్యవసాయ శాఖలో చేపడుతున్న హేతుబద్ధీకరణలో వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓ) మినహాయించాలి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి పొన్నాడ రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏఈఓలు అందరూ కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను హేతుబద్ధీకరణ పేరుతో వారి స్థాయిని తగ్గించాలని వ్యవసాయశాఖ చేపడుతున్న చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేశారు. సచివాలయ వ్యవస్థలో రికార్డ్ అసిస్టెంట్ స్థాయిలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ కలిగిన వ్యవసాయ విస్తరణ అధికారులను హేతుబద్ధీకరణతో చేసేలా వ్యవసాయ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. వ్యవసాయ శాఖలో సుమారు 12 నుంచి 30 ఏళ్ల అనుభవం కలిగిన విస్తరణ అధికారులను గ్రామ సేవా కేంద్రాలకు మినహాయించి, మండలంలో క్లస్టర్ స్థాయిలో విస్తరణ కార్యక్రమాలను చేసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు జె.ఎరుకనాయుడు, కోశాధికారి జగదీశ్వరరావు జిల్లాలో ఉన్న ఏఈఓలు పాల్గొన్నారు.